సాక్షి
మహబూబాబాద్
బుధవారం | 29 | మార్చి | 2023



ఏనుమాములలో వారిదే హవా!
ఏనుమాముల ప్రాంతంలో దశాబ్దాల క్రితం కొన్న ప్లాట్లు పెద్ద సంఖ్యల్లో ఉండడంతో రెండు, మూడు గ్యాంగ్‌లుగా ఏర్పడి కొందరు కబ్జాలకు తెరలేపారు. - 8లో▸



నమ్మించి.. నకిలీ బంగారం ఇచ్చి
దగ్గరి బంధువని నమ్మితే నట్టేట ముంచాడు. అసలు బంగారం ఎరగా.. చూపి నకిలీ బంగారం బిళ్లలు అంటగట్టాడు. దీంతో బాధిత వ్యక్తి రూ.2లక్షలు మోసపోయాడు. - 9లో▸




వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. పలుచోట్ల ఎండ తీవ్రత ఉంటుంది.



న్యూస్‌రీల్

పరీక్షలకు సన్నద్ధం చేయాలి



నెల్లికుదురు: పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈఓ రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలంటే విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని తొలగించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రాజయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఎం జె.విజయ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానుకోట మండలంలోని కంబాలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం దివ్యాంగులకు బస్సుపాసులు అందజేస్తారన్నారు. రాయితీతో కూడిన బస్సు పాసులు పొందాలనుకునే దివ్యాంగులు సదరం జిరాక్స్, ఆధార్, అంగవైకల్యం కలిగిన ఫొటో, రూ. 50 వెంట తీసుకురావాలన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

డీజీపీ నేర సమీక్ష



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి నేర సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు, తొర్రూరు డీఎస్పీ రఘు, ఏఓ జయరాజ్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీసీఆర్బీ సీఐ బాలాజీ వరప్రసాద్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

మహబూబాబాద్ అర్బన్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు మంగళవారం తెలిపారు. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకొనేందుకు జిల్లా పరీక్షల విభాగం అధికారి మందుల శ్రీరాములు 94905 56656 , 98487 61012 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



లాలు, అధ్యక్షుడు



నగేష్, ప్రధాన కార్యదర్శి

తొర్రూరు: తొర్రూరు బార్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బానోత్ లాలు, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ నగేష్, ఉపాధ్యక్షుడిగా అశోక్, కోశాధికారిగా రామకృష్ణ, కార్యదర్శిగా భిక్షపతి, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పల్లవి, ఈసీ మెంబర్‌గా విజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ప్రవీణ్‌రాజు, సహాయ అధికారి రఘురాంరెడ్డి సమక్షంలో కమిటీని ప్రకటించారు. ఎన్నికకు సహకరించిన అసోసియేషన్ ప్రతినిధులకు నూతన అధ్యక్షుడు లాలు, ప్రధాన కార్యదర్శి నగేష్ కృతజ్ఞతలు తెలిపారు.

‘పట్టా’రాని పాట్లు

- 2014లో 59జీఓ కింద దరఖాస్తులు
- ఎనిమిదేళ్లుగా అందని పట్టాలు
- ప్రస్తుతం దరఖాస్తులను తిరస్కరిస్తున్న అధికారులు
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- ఆందోళనలో దరఖాస్తుదారులు
- పట్టాలు ఇప్పించాలని కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



ఎనిమిదేళ్ల క్రితం డబ్బులు చెల్లించామని పత్రాలు చూపుతున్న దరఖాస్తుదారులు

సాక్షి, మహబూబాబాద్:



● ‘ఈ ఫొటోలోని మహిళ మహబూబాబాద్ పట్టణంలోని హన్మంతరావునగర్ ప్రాంతానికి చెందిన మేకల సరిత. ఈమె 2008లో 373గజాల ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసింది. కాగా 2014లో ప్రభుత్వం కల్పించిన 59జీఓ కింద భూమికి హక్కు పత్రాలు కల్పించాలని దరఖాస్తు చేసుకుంది. 2015 సెప్టెంబర్‌లో రెవెన్యూ అధికారులు వచ్చి స్థలాన్ని కొలిచారు. అప్పటి రేటు ప్రకారం మొత్తం స్థలానికి రూ.1,86,500 చెల్లించాలని చెప్పారు. దీనిలో మొదటి విడతలో రూ.80వేలు, రెండోవిడత రూ.13,250, మూడో విడత రూ.46,625, నాలుగో విడతలో రూ.46,625 చెల్లించింది. కాగా డబ్బులు చెల్లించి ఎనిమిది సంవత్సరాలైనా ఇప్పటి వరకు పట్టా ఇవ్వలేదు. చివరకు కలెక్టర్‌ను సంప్రదించగా మీ దరఖాస్తు తిరస్కరించారు. కొత్తగా దరఖాస్తు చేసుకోండి అని చెప్పడంతో ఆమె విస్తుపోయింది.’



● ‘ ఈఫొటోలోని మహిళ మహబూబాబాద్ పట్టణంలోని రామన్నపేట కాలనీకి చెందిన పింగిళి లలిత. ఈమె 2008లో 303 గజాల జాగాను రూ.6లక్షలు పెట్టి కొనుగోలు చేసి ఇల్లు కట్టుకుంది. అయితే అది ప్రభుత్వ భూమి కావడంతో రెగ్యులరైజ్ చేసుకోవాలని అధికారులు చెప్పారు. ఇందుకు 2014లో ప్రభుత్వం విడుదల చేసిన 59జీఓ కింద దరఖాస్తు చేసుకుంది. రెవెన్యూ అధికారులు లెక్కలు వేసి గజానికి రూ.వెయ్యి చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చారు. వారు చెప్పిన విధంగా మొత్తం రూ.3,03,000 చెల్లించింది. కానీ ఇప్పటి వరకు పట్టా ఇవ్వలేదు. ఇప్పుడు ఇస్తాం.. అప్పుడు ఇస్తామని చెప్పిన రెవెన్యూ అధికారులు.. చివరకు దరఖాస్తు తిరస్కరించారు. ‘మీ డబ్బులు ఎటు పోవు.. కానీ ఈ రోజు రేటు ప్రకారం డబ్బులు చెల్లించాలని’ చెబుతున్నారు. ప్రస్తుత రేటు ప్రకారం రూ.10లక్షల మేరకు చెల్లించాల్సి వస్తుంది. అయితే అదనంగా ఎలా చెల్లిస్తామని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.’

ఇలా ఒక్క మహబూబాబాద్ పట్టణంలోనే 600మందికిపైగా లక్షల రూపాయలు చెల్లించారు. అయితే వారికి ఇప్పటి వరకు పట్టాలు అందలేదు. ఎనిమిదేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినా పట్టా అందకపోగా.. 59జీఓ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు.

రూ.2కోట్లకుపైగా చెల్లింపు

ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇళ్లకు హక్కు పత్రాలు అందించేందుకు ప్రభుత్వం 58, 59జీఓలు విడుదల చేసింది. నిర్ణీత గడువులో దరఖాస్తుల స్వీకరణ, అధికారుల సర్వే, డిమాండ్ నోటీసు, డబ్బులు చెల్లించిన తర్వాత హక్కు పత్రాలను అందజేస్తారు. కాగా 2014లో కూడా ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించింది. కాగా ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న సుమారు 1,200 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఇందులో కొన్ని తిరస్కరించగా.. మరికొన్నింటికి 58జీఓ ద్వారా పట్టాలు అందజేశారు. అలాగే 611 మంది భూములకు 59జీఓ కింద అర్హత ఉందని రెవెన్యూ అధికారుల సర్వే చేసి వెల్లడించారు. అప్పటి భూమి రేట్ల ప్రకారం 50శాతం చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపించారు. ఈమేరకు తమ భూమికి హక్కుపత్రాలు వస్తాయని భావించి డబ్బులు చెల్లించారు. ఇలా రూ.2కోట్ల వరకు రెవెన్యూ శాఖకు ఆదాయం సమకూరింది. కానీ ఎనిమిది సంవత్సరాలు గడిచినా రెగ్యులరైజేషన్ సర్టిఫికెట్ మాత్రం ఇవ్వలేదు.

పెరిగిన రేట్లతో గగ్గోలు

అప్పుడు డబ్బులు చెల్లించిన వారికి ఇప్పటి వరకు రెగ్యులరైజేషన్ చేయలేదు. ఇదేమిటని అడిగితే మీ దరఖాస్తు తిరస్కరించారు.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. అయితే ఎనిమిది సంవత్సరాల క్రితం మహబూబాబాద్‌లోని భూముల ధరలకు ప్రస్తుత రేట్లకు పొంతన లేకుండా పోయింది. మూడు, నాలుగు రెట్లు పెరిగాయి. ఈ లెక్కన అప్పుడు రూ.3లక్షలు చెల్లించిన వారు.. ప్రస్తుతం రూ.10లక్షలు చెల్లించాల్సి వస్తుంది. ఎనిమిది సంవత్సరాలుగా డబ్బులు తమ వద్ద ఉంచుకొని.. ఇప్పుడు మళ్లీ దరఖాస్తు చేయమనడం సరికాదని, అప్పుడు చెల్లించిన డబ్బులతో రెగ్యులరైజేషన్ చేసి పట్టాలు ఇవ్వాలని మానుకోట పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి



గతంలో 59జీఓ కింద డబ్బులు చెల్లించారు. ఆ డబ్బులు రెవెన్యూశాఖ వద్ద ఉన్నాయి. అప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం అసైన్డ్ భూములకు 59జీఓ వర్తించదని దరఖాస్తులు తిరస్కరించారు. ఎవరి డబ్బులు వారు తీసుకోండి. ప్రభుత్వం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తిరిగి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పుడు అసైన్డ్ భూమిపై ఉన్న ఆంక్షలు ఎత్తివేశారు. ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం డబ్బులు చెల్లిస్తే రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

-నాగభవాని, తహసీల్దార్, మహబూబాబాద్

దేశంలోనే అగ్రభాగాన తెలంగాణ

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ దేశంలోనే అగ్రభాగాన నిలిపారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం, మడిపెల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో రైతులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి, వితంతువు మహిళలు, యువతీయువకుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. అభివృద్ధి పనులకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించినట్లు చెప్పారు. నిరుపేదలకు సొంత స్థలాల్లో ఇళ్లు కట్టిస్తామన్నారు. యువత, మహిళలకు పలురంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై పార్టీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని కొనియాడారు. కార్యకర్తల కృషితోనే రెండుసార్లు అధికారంలోకి వచ్చామని, మరోసారి అధికారం చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం అందరితో కలిసి మంత్రి భోజనం చేశారు. ఎంపీపీ అంజయ్య, జెడ్పీటీసీ శ్రీనివాస్, పీఆర్ స్టేట్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు సీతారాములు, రైతు సమితి జిల్లా సభ్యులు కిషోర్‌రెడ్డి, వీరభద్రారావు, సీపీఐ జిల్లా నాయకుడు తమ్మెర విశేశ్వర్‌రావు, సర్పంచ్‌లు యాకయ్య, చెడుపెల్లి ఉమారాణి, బానోత్ అచ్చమ్మ, అంజలి, నెరెడ్ల శ్రీపాల్‌రెడ్డి, యాకమ్మ, ఎంపీటీసీలు ఉప్పలయ్య, దేవమ్మ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదాయ వనరులు పెంచుకోవాలి

- కలెక్టర్ శశాంక
- రూ.37 కోట్లతో తొర్రూరు మున్సిపాలిటీ అంచనా బడ్జెట్



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

తొర్రూరు: మున్సిపాలిటీల ఆదాయ వనరులు పెంచుకునేందుకు పాలకవర్గాలు కృషి చేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో 2023–24 ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఇన్‌చార్జ్ కమిషనర్ సింగారపు కుమార్ అంచనా బడ్జెట్‌ను చదివి వినిపించారు. గతేడాది రూ.11.11 కోట్ల బడ్జెట్ ఉండగా ఈ ఏడాది రూ.37 కోట్లకు బడ్జెట్ పెరిగిందని వివరించారు. మున్సిపాలిటీ పన్నులు, వివిధ మార్గాల్లో సమకూరే ఆదాయ మార్గాలను, వేతనాలు, ఖర్చులను వివరించారు. అధికారులు ప్రతిపాదించిన బడ్జెట్‌ను ఎలాంటి సవరణలు లేకుండా యథావిధిగా ఆమోదిస్తూనే ఆదాయ, వ్యయం పెంపుపై సభ్యులు పలు సూచనలు చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిధుల కోసం వేచిచూడకుండా ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. వాణిజ్య సముదాయాలు, ప్రకటనల ద్వారా ఆదాయాన్ని రాబట్టాలన్నారు. ప్రతి ఐదేళ్లకోసారి ఇల్లు, కమర్షియల్ ట్యాక్స్‌లను సవరించుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ రోడ్ల విస్తరణ, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. రూ.7 కోట్లుగా ఉన్న మున్సిపాలిటీ వ్యయం రూ.16 కోట్లకు పెరిగితే ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు మంజూరవుతాయన్నారు. వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌లో 50 దుకాణాలు ఉండగా 10 దుకాణాలకే పరిమితం చేశారని, వాటి పరిమితిని పెంచి ఆదాయం పెంచుకోవాలన్నారు. వెలికట్ట గ్రామం మున్సిపాలిటీకి ఆనుకుని ఉండి ఆదాయానికి అనువుగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జినుగ సురేందర్‌రెడ్డి, ఏఈ రంజిత్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 8,461 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 50 కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 3న పరీక్షలు ప్రారంభమవుతాయని, ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. ఆయా వేళల్లో ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ ఉంటారని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాలు తెరుస్తారని చెప్పారు. పరీక్ష కేంద్రాలను శుభ్రంగా ఉంచాలని, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లాలోని గార్ల మండలానికి ఖమ్మం నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఎదురైతే విద్యార్థులు కంట్రోల్ రూం నంబర్ల 984961012, 7995087625లో సంప్రదించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జెడ్పీ సీఈఓ రమాదేవి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీఈఓ రామారావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో ఉపాధి హామీ పనులు చేపట్టే చోట ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అధిక ఉష్ణోగ్రతలపై తీసుకునే చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పని కల్పిస్తూ తగు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులు తమ పంట చేన్లలో చెత్తను తగులబెట్టకుండా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వేసవిలో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.

వీరన్న హుండీ ఆదాయం రూ.52.44లక్షలు



హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న అధికారులు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి హుండీ ఆదాయం రూ.52.44లక్షలు వచ్చినట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ప్రధాన హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ మానుకోట ఇన్‌స్పెక్టర్ నందనం కవిత సమక్షంలో లెక్కించారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ నెల 27 వరకు భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కించినట్లు ఆయన వివరించారు. కాగా హుండీ ఆదాయాన్ని లక్ష్మీ వెంకటేశ్వర ట్రస్ట్, మహాలక్ష్మిగణపతి సేవాట్రస్ట్ సభ్యులు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బాదె వెంకన్న, రవి, సమ్మయ్య, మహేష్, వీరన్న, నవీన్, ఆలయ పూజారులు రెడ్యాల శ్రీనివాస్, పెనుగొండ అనిల్‌కుమార్, విజయ్‌కుమార్, తేజ, పుణ్యమూర్తి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న డీడబ్ల్యూఓ వరలక్ష్మి

గార్ల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని డీడబ్ల్యూఓ వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దకిష్టాపురం పంచాయతీలో గర్భిణులకు నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటిస్తూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్ శారద, సర్పంచ్ గంగావత్ కుంతి, అంగన్‌వాడీ టీచర్లు నీలాదేవి, రుక్కమ్మ, సుజాత, అరుణ, సంత్ర, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం వరించేనా?

- జాతీయస్థాయి పంచాయతీ అవార్డులకు పరిశీలన
- జిల్లా నుంచి రెండు గ్రామపంచాయతీల ఎంపిక
- డోర్నకల్ మండలం నుంచే అర్హత



చాప్లాతండాలోని ప్రధాన వీధి



బొడ్రాయితండా గ్రామపంచాయతీ కార్యాలయం



అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సర్పంచ్(ఫైల్)

చాప్లాతండా గ్రామ వివరాలు	
జనాభా	1,532
పురుషులు	821
స్త్రీలు	711
గృహాలు	371

డోర్నకల్: త్వరలో ప్రకటించనున్న జాతీయస్థాయి పంచాయతీ అవార్డుల కోసం జిల్లా నుంచి రెండు గ్రామ పంచాయతీలు పోటీ పడుతున్నాయి. రాష్ట్రస్థాయి పరిశీలనకు తెలంగాణ వ్యాప్తంగా 32పంచాయతీలు ఎంపిక కాగా జిల్లాలోని డోర్నకల్ మండలం నుంచే చాప్లాతండా, బొడ్రాయితండా ఉండడం విశేషం. కాగా 32 పంచాయతీల నుంచి 27జీపీలు జాతీయస్థాయి పంచాయతీ అవార్డు(దీన్ దయాల్ స్వశక్తికరణ్ సతత్ వికాస్ పురస్కార్)కు ఎంపికయ్యే అవకాశం ఉంది.

తొమ్మిది అంశాల్లో డాక్యుమెంట్లు..

తొమ్మిది అంశాల్లో వివిధ డాక్యుమెంట్లు, ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు అవార్డుల కోసం అప్‌లోడ్ చేయడం ద్వారా జిల్లా నుంచి రెండు జీపీలు రాష్ట్రస్థాయి పరిశీలనకు ఎంపికయ్యాయి. ఈ మేరకు రాష్ట్రస్థాయి పరిశీలనకు మండలంలోని చాప్లాతండా సరిపడా నీరు ఉన్న గ్రామం, బొడ్రాయితండా మహిళా స్నేహపూర్వక గ్రామ విభాగాల్లో ఎంపికయ్యాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీలు పరిశీలనకు ఎంపిక కాగా.. ఇందులో నుంచి 27జీపీలను జాతీయస్థాయి అవార్డులకు ఎంపిక చేస్తారు.

చాప్లాతండా..

డోర్నకల్ మండలంలోని చాప్లాతండా గ్రామ సర్పంచ్ పాంగునాయక్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వందశాతం సోక్‌పిట్స్ నిర్మాణం, కమ్యూనిటీ సోక్‌పిట్స్, వాటర్ హార్వెస్టింగ్ సోక్‌పిట్స్, చెక్‌డ్యాం, సైడు కాల్వల చివరన సోక్‌పిట్స్, బాలవికాస వారి సహకారంతో సోలార్ ప్లానెట్‌తో నడిచే వాటర్ ప్లాంట్ ఏర్పాటు, వాటర్ ట్యాంకుల ద్వారా ప్రతిరోజు రెండుసార్లు తాగునీటి సరఫరా, ఇంటింటికీ నల్లాల ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా, వాటర్ టెస్టింగ్ కిట్లతో నీటి పరీక్షలు, గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రత, నిత్యం వాటర్ ట్యాంకులను శుభ్రపర్చడం, క్లోరినేషన్, ఉపాధి పథకం ద్వారా నీటి కందకాల తవ్వకం, రెండు నీటి చెరువుల నిర్వహణ, పశువుల నీటి తొట్టెల నిర్మాణం లాంటి పనులు చేపట్టారు. వీటితో పాటు గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో గ్రామం రాష్ట్రస్థాయి పరిశీలనకు ఎంపికైంది. కాగా చాప్లాతండా గ్రామం కచ్చితంగా జాతీయస్థాయి పురస్కారం అందుకుంటుందని గ్రామస్తులతో పాటు అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బొడ్రాయితండా...

బొడ్రాయితండా గ్రామం మహిళా స్నేహపూర్వక విభాగంలో రాష్ట్రస్థాయి పరిశీలనకు ఎంపికైంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, చంటి పిల్లల ఆరోగ్యం, పిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకపోవడం, పిల్లలందరికీ అబాకార్డుల ద్వారా ఇన్సూరెన్స్ చేయించడం, పాఠశాలల్లో వందశాతం హాజరు నమోదు, డ్రాపౌట్స్ లేకపోవడంతో రాష్ట్రస్థాయి పరిశీలనకు ఎంపికైంది. కాగా ఏప్రిల్ 24న పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయస్థాయి అవార్డులు ప్రకటిస్తారు. ఈమేరకు అవార్డుల జాబితాలో తమగ్రామం ఉంటుందని గ్రామస్తులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

శ్రమకు ఫలితం దక్కుతుంది..



చాప్లాతండా గ్రామాభివృద్ధికి అహర్నిశలు శ్రమించాం. గ్రామస్తుల సహకారం, పంచాయతీ కార్యదర్శి, అధికారుల ప్రోత్సాహంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. ఆరోగ్యం, పరిశుభ్రత, స్వచ్ఛత, పచ్చదనం తదితర అంశాల్లో గ్రామస్తులను చైతన్య పరిచాం. మాగ్రామానికి జాతీయ పురస్కారం లభిస్తే శ్రమకు ఫలితం దక్కినట్లవుతుంది.

-బానోత్ పాండునాయక్, సర్పంచ్, చాప్లాతండా

మార్కెట్‌కు సెలవులు



కేసముద్రం: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 30నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30న శ్రీరామనవమి, 31న ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా వ్యాపారుల కోరిక మేరకు సెలవు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 1, 2న వారాంతపు సెలవులు కావడంతో తిరిగి 3న మార్కెట్‌లో కొనుగోళ్లు జరుగుతాయని చెప్పారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మెమొంటో అందజేస్తున్న డీపీఎం నళినినారాయణ, అచ్యుతరావు

కురవి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ డీపీఎం నళినినారాయణ, కిసాన్‌పరివార్ సంస్థ సీఎస్‌ఓ అచ్యుతరావు అన్నారు. మంగళవారం సూదనపల్లి గ్రామంలోని కిసాన్ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో ‘ఉమెన్ ఆన్ రన్’ కార్యక్రమంలో భాగంగా మహిళలకు పచ్చళ్ల తయారీ విధానంపై అవగాహన సదస్సు జరిగింది. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాల్లో ఉండే మహిళలతో సమానంగా గ్రామీణ ప్రాంతంలో ఉండే మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చళ్లను తయారు చేసి అమ్మకం చేయడం ద్వారా అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీపీఎం చంద్రశేఖర్, ఏపీఎంలు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, తిలక్‌కుమార్, బాబు, సంస్థ సభ్యులు యుగేందర్, మహేష్, రమణ, ఖలీల్, సంతోష్, లవన్, భిక్షపతి, పవన్, సీసీలు సతీష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిక్కీ నుంచి రూ.5 లక్షలు అపహరణ

కాజీపేట: ద్విచక్ర వాహనంలో ఉన్న రూ.5 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్లు బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పద్మ అరవింద న్యాయవాది వద్ద పని చేస్తున్న పూలరాజు, గుండు శ్రీనివాస్‌లు ఆఫీసు పని మీద వడ్డెపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్దకు మంగళవారం చేరుకోగా.. బ్యాంకులో సర్వర్ బిజీగా ఉందని వెనక్కి వచ్చారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇద్దరు ఇంటికి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత స్కూటీ డిక్కీలో చూడగా.. రూ.5లక్షల నగదు కనిపించకపోవడంతో కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. పోలీసులు విభిన్న కోణాల్లో విచారణ జరుపుతున్నారు. నగదుతో రాజు, శ్రీనివాసులు తిరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. న్యాయవాది వద్ద పని చేసే సిబ్బందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గీత కార్మికుడిని కాపాడిన గ్రామస్తులు


జేసీబీ సాయంతో సోమన్నను కాపాడిన గ్రామస్తులు

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారుపోతుల సోమన్న సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ఆకస్మాత్తుగా బలంగా ఈదురు గాలి వీచింది. దీంతో మోకు జారి తల కిందకు అయింది. చెట్టుకు వేలాడుతూ ప్రాణాపాయంలో ఉన్న సోమన్న పరిస్థితిని గమనించిన తోటి గీత కార్మికుడు బాల్నె కుమార్ చెట్టు ఎక్కి గ్రామస్తుల సహకారంతో సోమన్నను తాళ్లతో కట్టి కిందకు దించేందుకు యత్నించాడు. గ్రామస్తులు పక్కనే పనులు నిర్వహిస్తున్న జేసీబీని తీసుకొచ్చి ముందు డబ్బాలో ఇద్దరు కూర్చుని చెట్టుపైకి వెళ్లి వేలాడుతున్న సోమన్నను సురక్షితంగా కిందకు దించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన గ్రామస్తులు గీతకార్మికుడి ప్రాణాల్ని కాపాడారు.

రాత్రంతా రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం వరకు రిజిస్ట్రార్ చాంబర్‌లోనే బైఠాయించి నిరసన తెలిపారు. సోమవారం సాయంత్రం రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాత్రి మొత్తం అక్కడే ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు నిరసన కొనసాగింది. సెనేట్ సమావేశం ముగిశాక పాలకమండలి సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అంతకుముందు పాలక మండలి సభ్యుడు టి.మనోహర్ సెనేట్ సమావేశంలో ఉండగా.. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన విషయం తెలిసి ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలు చెల్లించాల వీసీని కోరారు. దీనిపై వీసీ రమేశ్ స్పందిస్తూ వీరి నియామకం వివాదాస్పదమైందని, తన చేతిలో ఏమీ లేదని తెలిపారు. వీరి వేతనాల విషయంలోనే తనపై కేసు నమోదైందని వాపోయారు. కాగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను అకాడమిక్ సెనేట్‌లో చర్చించడం సరికాదని, పాలకమండలి సమావేశంలో చర్చించుకోవాల్సి ఉంటుందని కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు.

@ స్వేచ్ఛాగానం



కొత్తగూడ: ఇన్నాళ్లు జూ పార్కులో సందర్శకుల కోసం బందీలుగా ఉన్న చుక్కల దుప్పులను జూ, ఫారెస్ట్ అధికారులు మంగళవారం అటవీ ప్రాంతంలో వదిలారు. హైదరాబాద్ జూలో ఉన్న ఐదు ఆడ, ఐదు మగ చుక్కల దుప్పులను కొత్తగూడ మండలం ఓటాయి బీట్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ పంప్ వద్ద వదిలారు. అడవిలో దుప్పుల సంఖ్య పెరగడంతో జీవ వైవిధ్యం మెరుగు పడుతుందని డీఎఫ్ఓ రవికిరణ్ తెలిపారు. దుప్పుల రక్షణ కోసం ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

@ ప్రాణాపాయం



దుప్పితో అటవీ శాఖ అధికారులు

ఎస్ఎస్ తాడ్వాయి: అడవిలో స్వేచ్ఛగా గెంతుతున్న దుప్పి వేటగాళ్ల బాణానికి గాయపడింది. రేంజ్ అధికారి చౌకత్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ డ్యూటీలో భాగంగా మంగళవారం మేడారం బీట్ పరిధిలోని అడవి ప్రాంతంలో సెక్షన్, బీట్ ఆఫీసర్, వాచర్ అడవిలో విధులు నిర్వర్తిస్తుండగా.. పరుగెడుతూ కింద పడిన చుక్కల దుప్పిని పరిశీలించగా.. శరీరంలో బాణం గుచ్చుకొని ఉంది. వెంటనే అటవీ అధికారులు దుప్పిని తాడ్వాయి పశువైద్యశాలకు తీసుకెళ్లి బాణాన్ని తొలగించి చికిత్స అందించారు.

@ 'డెవిల్ ఫిష్' లభ్యం

- జాలర్ల వలకు చిక్కిన 38కేజీల బరువున్న అరుదైన చేప



కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ పరిధిలోని ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతంలో జాలర్ల వలకు మంగళవారం 38కేజీల బరువున్న అరుదైన డెవిల్‌ఫిష్ చిక్కింది. ఈ చేపను సిరొంచ ప్రాంతంలో బోధ్ అని కూడా అంటారని జాలర్లు పేర్కొన్నారు. అరుదుగా ఛత్తీస్‌గఢ్‌లో లభించే ఈ చేపలు సుమారుగా 50–70కిలోల వరకు బరువు ఉంటాయని, అధిక మాంసాహారం తింటుందని, ప్రొటీన్లు కూడా అధికంగా ఉంటాయని జాలర్లు తెలిపారు.

ఉంగరం పోయిందని.. ఉసురు తీసుకుంది


హేమలతరెడ్డి (ఫైల్)

దంతాలపల్లి: ఉంగరం పోయిందని మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన మద్దుల హేమలతరెడ్డి(19) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హేమలతరెడ్డి హనుమకొండలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉగాది పండుగ కోసం ఇటీవల ఇంటికి వచ్చిన హేమలతరెడ్డి చేతి ఉంగరం పోయింది. దీంతో మనస్తాపానికి గురైన సదరు యువతి ఇంట్లో వాళ్లు ఏమైనా అంటారనే భయంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సూసైడ్ లెటర్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి మద్దుల జానకీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీశ్ తెలిపారు.



వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 14వ డివిజన్ ఏనుమాముల ప్రాంతంలో దశాబ్దాల క్రితం కొన్న ప్లాట్లు పెద్ద సంఖ్యలో ఉండడంతో రెండు, మూడు గ్యాంగ్‌లుగా ఏర్పడి కొందరు కబ్జాలకు తెరలేపారు. ఓ గ్యాంగ్‌కు రాజకీయంగా పలుకుబడి ఉన్న వారి ఆశీస్సులు ఉండగా.. మిగిలిన గ్యాంగులకు రాజకీయ, సామాజిక ఉద్యమాలకు చెందిన వారు నేపథ్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కాని సమయంలోని ఏనుమాముల గ్రామ పంచాయతీ పరిధిలో సుందరయ్యనగర్, బాలాజీనగర్, మణికంఠకాలనీ, మధురానగర్, లక్ష్మీగణపతి కాలనీ, సాయి గణేశ్‌నగర్, ఎస్ఆర్‌నగర్, గాంధీనగర్, ప్రతాప రుద్ర కాలనీ, ముసలమ్మకుంట, చాకలి ఐలమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాలను ప్లాట్లు చేసి విక్రయించారు.

ఏనుమాములలో వారిదే హవా!

- ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా
- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టింపు శూన్యం
- సీపీ దృష్టికి వెళ్లడంతో టాస్క్‌ఫోర్స్ రంగ ప్రవేశం
- అదుపులో కార్పొరేటర్ భర్త, మరో నలుగురు నేతలు
- పరిశీలనలో మరికొంత మంది నేతల జాబితా

వరంగల్ నగరానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ లేఔట్ తదితర ఆంక్షలు లేక పోవడం, తక్కువ ధరలకు ప్లాట్లు లభిస్తుండడం, భవనాలు నిర్మించుకుంటే అనుమతులు సులభంగా వస్తుండడంతో వందలాది మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. 200 గజాల ప్లాటు కేవలం రూ.లక్ష నుంచి రూ.2 లక్షలలోపు రావడంతో మధ్యతరగతికి చెందిన వారు ఎక్కువ మంది కొన్నారు. ఆర్థికంగా ఉన్న వారు అప్పుడు తాత్కాలికంగా ఇల్లు, షెడ్లు, ప్రహరీలు నిర్మించుకుని గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు పొందడంతో వారు కబ్జా రాయుళ్ల నుంచి తప్పించుకున్నారు. భవిష్యత్‌లో తమ పిల్లల అవసరాలు, పెళ్లిళ్లకు అక్కరకు వస్తాయని కొనుగోలు చేసిన వారు మాత్రం ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో ఏనుమాముల గ్రామ పంచాయతీ విలీనం అవుతుందని తెలిసిన వారు చాలా మంది ముందస్తుగా ఇంటి నంబర్లు పొందారు. కొంత మంది కొన్నప్పటికీ స్థానికంగా లేక పోవడం వల్ల రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి కదా.. అనే ధీమాతో ఉన్న వారు ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారు.

పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ధరణి పోర్టల్‌లో కాస్తు కాలంలో సైతం పట్టాదారుడి పేరు రావడంతో కబ్జా రాయుళ్ల పంట పండుతోంది. అప్పటి పట్టాదారులకు చెందిన వారసుల (హక్కుదారుల)తో ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్లాట్లను అక్రమించుకునే పనిలో పడ్డారు. దీంతో బాధితులు తమ ప్లాట్లను ఆక్రమించుకుంటున్నారని పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. రాజకీయ నేతల ఒత్తిళ్లతో పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయినట్లుగా తెలుస్తోంది. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంటనే భూకబ్జాదారులు, అక్రమణల గ్యాంగ్‌లపై దృష్టి పెట్టడంతో బాధితులు కమిషనర్ కార్యాలయం దారి పట్టారు. భూకబ్జాలు, అక్రమణల వల్ల ప్రభుత్వానికి సైతం అపవాదు వస్తున్నందున అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే అధికార పార్టీకి చెందిన వారైనప్పటికీ ఆక్రమణ, కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం.

కబ్జాదారులకు ఫైనాన్షియర్ల అండ

ఏనుమాముల, కోటిలింగాల గుడి ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడే గ్యాంగులకు కాశిబుగ్గకు చెందిన ఇద్దరు, ముగ్గురు ఫైనాన్సియర్లు ఆర్థికంగా సహాయం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.కోటి విలువగల ప్లాట్లకు రూ.5 నుంచి రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే వచ్చిన మొత్తంలో సగం ఫైనాన్సర్లు తీసుకుంటున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ప్లాట్ దక్కని పరిస్థితుల్లో సైతం పెట్టిన పెట్టుబడి గుడ్‌విల్ కింద వస్తేనే వదిలివేస్తున్నట్లుగా తెలిసింది. ఇందులో ఒక ఫైనాన్సర్ వివాదాస్పద భూములు కొనేందుకు మాత్రమే పెట్టుబడి పెడుతున్నట్లుగా తెలిసింది.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఐదుగురు, రాత్రి విడుదల

- వారిలో కార్పొరేటర్ భర్తతో సహా నలుగురు నేతలు


కాశిబుగ్గ కార్పొరేషన్ సర్కిల్ కార్యాలయం ముందు పోలీసు వాహనాలు

వరంగల్: ఏనుమాముల ప్రాంతంలో పలు భూవివాదాల్లో జోక్యం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 14వ డివిజన్ అధికార పార్టీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య, బాలాజీనగర్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ తూర్పాటి రఘు, తూర్పాటి శ్రీను, సుందరయ్యనగర్‌కు చెందిన జంగం రాజు, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గండ్రతి భాస్కర్‌లను మంగళవారం ఉదయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దేశాయిపేటతోపాటు 14వ డివిజన్‌లోని బాలాజీనగర్, మధురానగర్, కోటిలింగాల దేవాలయం, మణికంఠకాలనీల్లోని స్థలాలను ఆక్రమించుకొని సంబంధిత యాజమానులను బెదిరింపులకు పాల్పడినట్లుగా వీరందరిపై ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో పలు ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఏనుమాముల గ్రామ పంచాయతీలో ఉద్యోగిగా పని చేసిన ఓ వ్యక్తి పోస్టుకు రాజీనామా చేసి బంధువులైన అధికార పార్టీ నేత, నాయకులతో కలిసి భూదందాలపై పడినట్లుగా తెలిసింది. ఈ వ్యవహారం వర్ధన్నపేట ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సదరు నేతను భూ వివాదాల్లో జోక్యం చేసుకోవద్దని బహిరంగంగా హెచ్చరించినట్లు తెలిసింది. దీనికి తోడు రాష్ట్రస్థాయి ముఖ్య నేతల భూముల్లోనూ జోక్యం చేసుకోవడం వల్లే టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరి అరెస్ట్ విషయంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులను వివరణ కోరగా విచారణ కోసం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి కాశిబుగ్గలోని గ్రేటర్ వరంగల్ సర్కిల్ కార్యాలయానికి మూడు పోలీసు వాహనాలు వచ్చాయి. కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పోలీసులు భూ అక్రమణల ఆరోపణలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా.. అదుపులోకి తీసుకున్న ఐదుగురిని రాత్రి పోలీసులు విడుదల చేశారు. అదేవిధంగా వరంగల్ తూర్పునకు చెందిన మరో నలుగురు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పేర్లు ఆక్రమణలు పాల్పడే వారి జాబితాలో ఉన్నట్లుగా తెలిసింది. ఇప్పటికే ఆ స్థలాలను ఆక్రమించుకుని వారి అధికారంతో ప్రహరీలు, తాత్కాలిక షెడ్లను నిర్మించి ఇంటి నంబర్లు సైతం తీసుకున్నట్లు తెలిసింది.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి దయాకర్‌రావు


మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 50 రోజులుగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కొనసాగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల అధ్యయన శిబిరం మంగళవారం డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్‌లో ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ కె.శశాంక పాల్గొన్నారు. వీఎంఎఫ్ వ్యవస్థాపకులు తక్కెళ్లపల్లి రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు 50 రోజుల పాటు తొర్రూరులో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసతి, భోజనంతో కూడిన వార్షిక పరీక్షల అధ్యయన శిబిరం నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ ఫౌండేషన్‌లో బాలికల వసతికై రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకై విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీఈఓ రామారావు, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఆర్డీఓ ఎల్.రమేశ్, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటా రవీందర్, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న ఏసీపీ, పక్కన సీఐ, ఎస్ఐ

జనగామ: జనగామలో ఆర్థిక లావాదేవీల విషయంలో జరిగిన గొడవలో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్టేషన్‌లో సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట మండలం బొమ్మకూరుకు చెందిన మాలోతు విజయ, భర్త తిరుపతి మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. దీంతో విజయ తన ముగ్గురు పిల్లలను తీసుకుని జనగామ పట్టణం గుండ్లగడ్డకు మకాం మార్చింది. కుటుంబ పోషణ కోసం హైదరాబాద్ లక్డీకపూల్ ఓఫంక్షన్ హాల్‌లో క్యాటరింగ్ పనికి కుదిరింది. ఈసమయంలో కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లా గ్రామానికి చెందిన లేబర్ కాంట్రాక్టర్ మాలోతు మోహన్‌రావుతో పరిచయం ఏర్పడింది. ఆయనతో సహజీవనం చేస్తూ వారిద్దరూ జనగామలో స్థిరపడ్డారు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 25న రాత్రి 9 గంటలకు మోహన్‌రావు ఆమెతో గొడవకు దిగాడు. ఈసమయంలో పక్కనే ఉన్న రోకలి బండ తీసుకుని తలపై బాదాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె కుప్పకూలింది. విషయం తెలుసుకున్న కుమారుడు, అతడి స్నేహితులు విజయను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. ఆమె అప్పటికే మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈక్రమంలో మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఎస్ఐలు రఘుపతి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా నిందితుడు మోహన్‌రావు పట్టుబడ్డాడు. పూర్తి సాక్ష్యాధారాలతో ఆయనను కోర్టులో రిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ సృజన్, పీసీలు కె.అనిల్‌కుమార్, వి.కిరణ్ కుమార్, ఎన్.సాగర్, అనిత ఉన్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన వారిని ఏసీపీ అభినందించారు.

నగల దొంగ అరెస్ట్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో నగల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాపురం సీఐ శివప్రసాద్ మంగళవారం పోలీస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఎస్సై తిరుపతితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో ఒక వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. పారిపోతున్న వ్యక్తిని వెంబడించి పట్టుకుని విచారించారు. అతడిని ఏటూరునాగారం మండలం రామ్‌నగర్‌కు చెందిన కాలాల రవిగా గుర్తించారు. అతడు పలు దొంగతనాలు చేసినట్లుగా విచారణ తేలింది. అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. సుమారు రూ.ఏడు లక్షల విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి మృతి

- నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొన్న బస్సు
- అక్కడికక్కడే ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


శ్రీను (ఫైల్)


శ్రీను మృతదేహం

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులో మిర్చి లోడుతో వెళ్తున్న ఓ మినీ గూడ్స్ టైర్ పంక్చరై రోడ్డు పక్కన నిలిపి ఉంచిన క్రమంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గయ్యగూడెం రోళ్లబండ తండాకు చెందిన ధరావత్ శ్రీను(46) అక్కడికక్కడే మృతి చెందాడు. రైతులు వెంకన్న, భీమాకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీను వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా 20 గుంటల్లో మిర్చి సాగు చేశాడు. మిర్చిని అమ్మేందుకు అతడి తమ్ముడు ధరవత్ భీమాకు చెందిన టాటా మినీ గూడ్స్‌లో మరో రైతు బానోతు వెంకన్నకు చెందిన మిర్చి బస్తాలను లోడ్ చేసుకొని మంగళవారం తెల్లవారుజామున వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు బయల్దేరారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులో మినీ గూడ్స్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని నిలిపి చూస్తుండగా.. ఖమ్మం నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న లగ్జరీ బస్సు వేగంగా మినీ గూడ్స్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈఘటనలో తలకు బలమైన గాయాలవడంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు వెంకన్న, భీమాకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అజాగ్రత్తగా నడిపి తన భర్త మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ ఎ.భగవత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ధారవత్ బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై సదానందం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..


అశోక్(ఫైల్)

నెక్కొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని నెక్కొండకు చెందిన చొప్పరి అశోక్(28) మంగళవారం మృతి చెందాడు. అశోక్ రెండు నెలల నుంచి అప్పల్‌రావుపేటలోని అమ్మమ్మ భద్రమ్మ వద్ద ఉంటున్నాడు. గ్రామంలోని ఊర చెరువులో చేపలు తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్లాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఊర చెరువు కట్టపై ఢీకొంది. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కెన్యాలో ధర్మరావుపేట రైతు..


బ్రహ్మచారి(ఫైల్)

ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మచారి(55) కెన్యాలో మృతి చెందాడు. బ్రహ్మచారి ఇరవై ఏళ్ల క్రితం కెన్యాలోని తాంజానియాలో స్థిరపడ్డాడు. అక్కడ సుమారు 25 ఎకరాల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో పంట చేను వద్ద చెట్లపై ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అతడు మంగళవారం మృతి చెందాడు. బ్రహ్మచారి గ్రామాభివృద్ధికి తనవంతుగా తరచూ సహకారం అందించేవారని గ్రామస్తులు కేఎస్‌చారి, కోటి, వెన్ను పూర్ణచందర్, విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ బాధ్యులు తెలిపారు.

ఊపిరాపిన ఫ్యాన్!

- ఊడిపడి బాలిక మృతి


శ్రావణి (ఫైల్)

పెద్దవంగర: గాలినివ్వాల్సిన ఫ్యాన్ ఊడిపడి ఓ చిన్నారిని ఊపిరిని ఆపేసింది. హాయిగా నిద్ర పోయిన చిన్నారి.. తీవ్ర గాయాలై శాశ్వత లోకాలకు వెళ్లిపోయింది. నిద్రిస్తుండగా ఫ్యాన్ ఊడి పడి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రు తండాకు చెందిన జాటోతు యాకులు, లలిత దంపతుల మొదటి సంతానం శ్రావణి(9) మృతి చెందింది. శ్రావణి మూడో తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబీకులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఈక్రమంలో ప్రమాదవశాత్తు సీలింగ్ ఫ్యాన్ శ్రావణిపై పడింది. తీవ్ర గాయాలవడంతో తల్లిదండ్రులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రావణి మంగళవారం మృతి చెందింది. తొమ్మిదేళ్లకే నూరేళ్లు నిండాయా అని తల్లిదండ్రుల రోదించిన తీరు తండా వాసులను కంటతడి పెట్టించింది.

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన


బండారి అఖిల్ (ఫైల్)


హర్షవర్ధన్ (ఫైల్)


ఆస్పత్రి వద్ద ఏడుస్తున్న తల్లిదండ్రులు

మొగుళ్లపల్లి: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు వాగులో మునిగి చనిపోయారు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల వాగులో సోమవారం సాయంత్రం జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కొర్కిశాలలోని మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు, ఇస్సిపేట చెందిన ముగ్గురు, రంగాపురానికి చెందిన ఒకరు, లక్ష్మీపురానికి చెందిన ఒకరు మొత్తం ఏడుగురు విద్యార్థులు పాఠశాలకని బయల్దేరి మొగుళ్లపల్లి బస్టాండ్ కూడలిలో కలుసుకున్నారు. పాఠశాలకు వెళ్లకుండా కొర్కిశాల వాగుకు ఈతకు వెళ్లారు. వాగులో దిగి ఈత కొడుతుండగా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన బండారి కొమురయ్య–సమ్మక్కల రెండవ కుమారుడు అఖిల్ (14)తో పాటు రంగాపురం గ్రామానికి చెందిన వురుసుల కుమారస్వామి కావ్యల కుమారుడు హర్షవర్ధన్(14)లు లోతట్టు ప్రాంతానికి వెళ్లి గల్లంతయ్యారు. మిగతా విద్యార్థులు భయపడి విషయాన్ని గోప్యంగా ఉంచారు. రాత్రి వరకు అఖిల్, హర్షవర్ధన్లు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై తోటి స్నేహితుల్లో ఒకరిని ఆరా తీయగా జరిగిన విషయం చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, స్థానికులు వాగులో గాలింపు చర్యలు చేపట్టగా అర్ధరాత్రి 1 గంటకు రంగాపురం గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (14) మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం 7 గంటలకు అఖిల్ (14) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. విద్యార్థులు మృతిపట్ల అనుమానం ఉందన్న తండ్రి వురుసుల కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, పిల్లలందరూ ఈతకు వెళ్లేముందు కల్లు తాగినట్లు సమాచారం.

అన్నయ్య కావాలి...

రంగాపురం గ్రామానికి చెందిన మృతుడు హర్షవర్ధన్ చెల్లి హనీ 'నాకు అన్నయ్య కావాలి.అన్నయ్యతో మాట్లాడాలని, అన్నయ్యతో ఆడుకోవాలి'అంటూ ఏడుస్తుంటే బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.